


# నిరీక్షించిన నళిని

తెల్లారింది. సూర్యకాంతి గదిలోకి ప్రసరిస్తోంది.

నళిని హృదయంలో కూడా ఉదయం అయింది లగాయితు ఏదో అనిర్వచనీయమైన ఆనందం ఉబుకుతోంది. పక్కమీది నుంచి లేస్తూనే నవ్వుకుంటోంది. ఇలా ఉదయానికి ఉదయం నిద్రనుంచి లేస్తూ తనలో తాను మురిసిపోయే నళిని వైఖరికి ప్రభ విస్తుపోయింది. "ఏమిటది నళినీ!" అంది. 'ఏం లే' దంది నవ్వుతూ. ఆవులించి వళ్లు విరుచుకొని లేచి నిల్చొంది. నళిని ఏవేవో మధురస్వప్నాల్లో తేలియాడుతున్నదని ప్రభ తెలుసుకోలేక పోయింది.

రోజూకంటే నళిని సంతోషంగా వుంది. కాలకృత్యాలు ముగించుకొని తొరతొరగా స్నానంచేసి చీరె మార్చుకుంది. అద్దంముందు కూచొని శ్రద్ధగా అలంకరించుకుంది. రోజూటి వలె గాకుండా ఇవ్వాళ్ల ఇలా ఈరకంగా తయారవటంలో ఏదో విశేషముందని అనుకున్నదే గాని అదేమిటో ప్రభకు తెలీదు. తెలుసుకునేందుకు కావలసినంత అనుభవం కూడా ప్రభలో లేదు ప్రభ ఇంటర్ ప్యాసై 'మెడిసిన్' మొదటి సంవత్సరంలో చేరింది. నళిని థర్డ్ యం. బి. చదువుతోంది.

బయటికి వెళ్లబోతూ నళిని- 'ప్రభా! నేనో గంటలో వచ్చేస్తాను' - అంది మోరిస్ స్ట్రీట్‌లో వున్న తన స్నేహితురాలింటికి వెళ్లిందిగాబోలని ప్రభ అనుకుంది కాని నళిని వెళ్లింది 'క్రిష్ణనగర్'కు దగ్గర్లోనే! అక్కడే చంద్రం నివాసం.

చంద్రం 'బి. ఇ. ఫైనలియర్' చదువుతున్నాడు. నళిని రావటం చూచి ఒక్కసారి ముందుకొచ్చి- లోనికి రమ్మని ఆహ్వానించాడు. ఆ కబుర్లూ ఈ కబుర్లూ మాట్లాడుకున్నారు. ఒకరినొకరు పరామర్శించుకున్నారు. అవతలగా పెట్టెప్రక్క వున్న ఫిడేలు చూసింది నళిని. 'చంద్రం! వైలెన్ వాయించవూ?' అంది. చంద్రం నవ్వుతూ తాగేతాగే సిగరెట్ ఆఖరు సారి ఒక పీల్పుపీల్చి అవతల పారేసి ఫిడేలు కమాన్ పుచ్చుకున్నాడు. మధురగానం ఒలికొలికి పోయింది. చంద్రం హిందోళం అతి చక్కగా వాయిస్తాడు. వాయిస్తున్నంతసేపూ చంద్రం నళిని మొహంలోకి చూస్తూ వుండి పోయాడు. నళిని అతని అందానికీ, అతను వినిపించిన సంగీతానికీ ముగ్ధురాలయి పోయింది. మాటలు పెకలి రాలేదు. ఏవో ఆశలు చిగురుస్తున్నాయి.

గదికొచ్చేసింది. ప్రభా తనూకలిసి 'మెస్'లో కెళ్లి భోజనం చేశారు. మళ్ళా గదికొచ్చి పుస్తకాలు తీసుకొని పదిన్నరకు కాలేజీకి వెళ్ళారు. భోజనం దగ్గిరా, గదికొచ్చి పుస్తకాలుతీసుకొన్న

దండమూడి మహీధర కుమార్

ప్పుడూ, కాలేజీకి వెళ్ళేదారిలో - చంద్రం గుర్తుకొచ్చాడు. అప్రయత్నంగా నవ్వుకుంది.

* * *

నళిని క్లాస్‌లో కూచుంది. ఎదురుగా ఒక ప్రక్కన రావు కూచున్నాడు. వెనక్కి దువ్వుకున్న 'వేవ్‌డ్ హేర్'-ఎత్తయిన ఫాలభాగం, అప్రయత్నంగా ఆకర్షించే మొహం. 'ఫ్రీ రెజిస్ట్రేషన్' దగ్గర్నుంచీకూడా నళినికి అతనంటే ఇష్టం. నళినికి రావు తన వేపే చూస్తూంటే ఏదో తెలీని ఆనందం పరవళ్ళు తొక్కేది. ఈ రోజు కూడా అలాగే చూస్తున్నాడు. నళినిలో ప్రేమ పొంగింది.

క్లాస్ అయ్యాక రావును కలుసుకుంది—'నర్జికల్ ఎనాటమీ' నోట్సు ఇవ్వమని అడిగింది. మాట్లాడేందుకు ఇదొకసాకు మాత్రమే.

ఒంటరిగా నిల్చొని అరగంట సేపటివరకూ మాట్లాడు కుంటూనే ఉన్నారు-ఏవేవో పిచ్చాపాటీగా! విషయాలేమీ లేక పోయినా సంభాషణ అనర్గళంగా గంటల కొలదీ సాగిపోతుంది-ఇలాంటి తొలిరోజుల్లో! అయితే టైం లేక పోవటంవల్ల ఇద్దరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

* * *

రోజూ ఉదయం కాలేజీ టైం వరకూ నళిని క్రిష్ణనగర్‌కు వెళ్లేది. రూంమేట్‌గా వుంటున్న ప్రభ మోరిస్ స్ట్రీట్‌కు వెళ్లిందని తలచేది. కాని రోజూ నళిని చంద్రం వైలెన్‌మీద వాయించే 'హిందోళం' వినేందుకు వెళ్తున్నదని - ప్రభకు తెలీదు. ఆ సంగీతం వింటున్న కొద్దీ ఆమెలో ఎన్నెన్నో భావాలు పనిచేస్తుండేవి! ఆ భావాలు కూడా 'హిందోళం' అంత మధురమైనవి! "ఈ భావాలు విన్నరోజు చంద్రం హృదయం నిండిపోతుంది. ఆనందాతిరేకంతో భావాల్ని 'యాంక్సెప్ట్' చేస్తాడు"- అని నళిని తలచేది.

ఎన్నో ఉదయాలు గడచి పోయాయి. ప్రభకు అసలు రహస్యం తెలీనేలేదు. ఓరోజను కున్నది- పరీక్షలు దగ్గర కొచ్చినా చదవదేం అని! ఇలా అని అడిగే సాహసం ప్రభలోలేదు. కాని ఆ తరువాత ఇలాఅనుకుంది· నళిని మోరిస్ స్ట్రీట్‌లో ఉన్న తన స్నేహితురాలి దగ్గరకు చదువుకుందికి వెళ్తోందని.

కాలేజీ నాలుగ్గంటలకి అయిపోతే ఏదూ ఏదున్నరవరకూ ఎక్కడికి కెళ్తావని ప్రభ ఏ రోజూకూడా నళినిని అడగలేదు. ఆసమయంలో నళిని ఎక్కడికికెళుతుందో,ఏంచేస్తుందో ప్రభకు తెలీదు. ఒకవేళ ఏదింటివరకూ రావుతో మాట్లాడుతూ వచ్చిందని తెలిసినా ఏమీ అనుకోదు. అయితే ఇలా రోజూ జరుగుతున్నదే అని తెలిస్తేమాత్రం ఎన్నెన్నో అనుకునే వుండేది! ఒకరోజూ...రెండు రోజులు. కాదు వారాలు, నెలలూ గడిచిపోతున్నాయి. పశ్చిమాన సూర్యుడు క్రుంగుతూ గులాబీరంగు పూసుకున్న ఎన్నో అందమైన సాయంత్రాలు నెలలుగా మారినా ఈవిషయం ప్రభకు తెలీక, పైవెచ్చు కోర్సుకు సంబంధించిన విషయాలు చర్చిస్తూ తన స్నేహితురాంద్రతో వుండి వుంటుందని ప్రభ నమ్మింది.

రోజూవలెనే నళిని ఉదయం లేచింది. రోజూవలెనే నవ్వుతూ లేచి కాలకృత్యాలు ముగించుకొని అద్దంముందుకూచుంది. ఏవేవో అనుకున్నది. ఈరోజు చంద్రానికి చెప్పెయ్యాలనుకున్నది-అతన్ని తాను ప్రేమిస్తున్నట్లు! మరో నిమిషంలో ఈరోజు తను వెళ్ళకూడా ఒక ఉత్తరం రాద్దామనుకుంది. గబగబా లేచి కలం కాగితం తీసుకుంది_'డియర్ చంద్రం! నేను నిన్ను ప్రేమిస్తున్నా...' అని రాసి ఆగిపోయింది. "ఒక స్త్రీ తొందరపడి తన అంతర్యాన్ని తెలుపకూడదు. పురుషుడు స్త్రీనిచూచి భావాల్లోకరిగి ఏదో రోజు తన ప్రేమను వెల్లడిస్తాడు. తన్ను వివాహమాడతావా అని అడుగుతాడు. ఆ ముహూర్తం కోసమే ఎదురు చూస్తున్న స్త్రీ వెంటనే తన స్వీకరాన్ని తెల్పుతుంది. అప్పుడే ప్రేమ సాఫల్యం చేకూర్చుకుంటుంది ఆని అనుకున్నది. కాగితం చించేసింది. నిజంగా తన వివాహం చంద్రంతో అయితే ఎంత బావుంటుంది! అతను ఇంజనీయర్, తను డాక్టర్-జీవితం హాయిగా గడిచిపోతుంది – అని అనుకున్నది. ఒక్కసారిగా లేచి బెడ్‌మీద పడుకుంది. ఆ సమయంలో ప్రభ గదిలోవుండివుంటే ఆ భావాల్లో పొంగిపోయే వైఖరికి తప్పక కారణం అడిగివుండేది.

సరిగా భోజనంవేళకి ప్రభ వచ్చింది. ఇద్దరూ కలిసి కాలేజీకి వెళ్లారు. రావు కన్పించాడు. ఎందుకో ఇవాళ్టి రావును చూడగానే భయం వేసింది. ఒక్కసారిగా తను ఉదయం ఆలోచించిన విషయాలు స్మృతిపథంలో తారట్లాడినాయి. లేచి 'గరల్స్ వెయిటింగ్ రూం'లోకి వెళ్ళింది. ఆలోచనా పరంపరలు లేస్తూ పడుతూ ఉన్నాయి. 'నేను చంద్రాన్ని ప్రేమించను, అతనితో వివాహమాట్టం నాకిష్టంలేదు. అతను ఇంజనీయర్ అవుతాడు, నేను డాక్టర్ని! కార్యక్షేత్రాలు వేరవటంచేత మా దాంపత్యంలో అవాంతరం వాటిల్లుతుంది. నేను రావుని ప్రేమిస్తున్నాను. అతనితో నా వివాహమయితే జీవితంలో వెలితి అనేది వుండదు. అతనే నేను, నేనే అతనై డాక్టర్లగా మంచి పేరును సంపాయించుకుంటాం. మా దాంపత్యానికి లోకం వెన్నెలహారతు లిస్తుంది. ఒకే క్షేత్రానికి సంబంధించిన మా దాంపత్యం కలకాలం నిలిచివుంటుంది, ఇలా ఎన్నో వూహాల దోనెల్లో నళిని తేలి యాడుతూనే వుంది. ఆఖరికి క్లాసుకు వెళ్ళకుండానే గది కెళ్లిపోయింది.

గదికి రావటంతోనే ఉదయం - 'డియర్ చంద్రం...నిన్ను నేను ప్రేమిస్తున్నా'నని రాసి చించేసిన చిన్న చిన్న కాగితాలు కన్పించాయి. వాటిలోనుంచి చంద్రం అందమైన ముఖబింబం కన్పించి-'నళినీ! నిన్ను ప్రేమిస్తున్నా!' అని చెప్పినట్టుగా తోచింది. ఒక్కసారిగా తనలో సంకుల సమరం చెలరేగింది. కొంచెం కుదట బడ్డాక - ఒక్కసారి చంద్రం మీదికి దృష్టి పోనిచ్చింది. అంతలోకే అతని 'హిందోళం' స్మృతికొచ్చి హాయిని చేకూర్చింది-ఎండ కాసి కాసి ఆపైని వర్షం పడినప్పుడు భూమిలోనుంచి వచ్చే వాసనలా! 'అతను ఇంజనీయర్ అవుతాడు. నేను డాక్టర్ని. అతని అనుభూతులు, నా అనుభూతులు ఏకమై ఒక క్రొత్త జీవితంగా ఏ నిత్యం కొంగ్రొత్త విషయాల్ని చర్చించుకుంటూ-నా అనుభవాల్ని అతనికీ, అతని అనుభవాల్ని నాకూ పరస్పరంగా చెప్పుకొన్నాక ఏర్పడ్డ దాంపత్యం ఒక నూతన జగత్తుకు ప్రాతిపదిక అవుతుంది. యావత్తు జీవితం ఒకే రకమైన ఒరవడిలో రాపిడవుతూ ఎప్పుడూ హాస్పిటల్, ... జబ్బులు...రోగులు...మందులు - ఇంకో మాట లేకుండా-వీటిల్లోనూ తన జీవితాన్ని గడుపుకోట మంత హేయమైంది మరొకటుండబోదు. నేను రావును ప్రేమించలేను. అతను నా స్నేహితుడు మాత్రమే. అంతే!' అనుకుంది.

*  *  *

ఆరెండురోజులూ నళిని చంద్రాన్ని కలుసుకోలేదు మూడోరోజు వెళ్ళిందికి తయారై వాకిట్లోకి వచ్చేప్పటికి- చంద్రం కన్పించాడు. ఒక్కసారి ఆశ్చర్యపోయింది. అతనిక్కడికి రావటం నళిని కిష్టంలేదు. కారణం ఈరోజు నళిని తన హృదయాన్నివిప్పి చంద్రంముందు వుంచాలని తీర్మానించుకుంది. వచ్చిన మనిషిని వెళ్ళమని ఎలా అనడంఅని అనుకొని లోనికి ఆహ్వానించి కుర్చీలో కూచోమంది రాగానే. చంద్రం-గది నలువేపులా చూచి ప్రభ షెల్ఫ్ బెడ్డింగ్‌వున్న వేపు చూసి ఆమె ఎవరన్నాడు? 'ఫస్టియర్, ప్రభ: ప్రక్క రూంలో వుంద''ని చెప్పింది.

'నళినీ! మా పరీక్షలు నిన్నటితో అయిపోయాయి. ఈరోజు మధ్యాహ్నం బండికి ఇంటికెళుతున్నాను. ఉదయం మా నాన్న-ఇంకో వూరువెళ్లి వస్తూ ఇక్కడ దిగాడు. నీదగ్గరకు నేనే రావటం బావుంటుందని వచ్చాను. పైగా వెళ్లబోయే రోజు నీగది చూచినట్టుకూడా వుంటుంది. ఇంటికెళ్ళగానే ఉత్తరం రాస్తాను. సమాధానం రాస్తావుగదూ?' - ఇవీ చంద్రం పలికిన మాటలు.

నళిని హృదయంలో ఒకసారి అగ్నిపర్వతం ప్రజ్వరిల్లి నంత పనయింది. ఏం చెప్పాలో తనకే అర్థమవలేదు. తాను చెప్పాల్సిన విషయం ఒక్క నిమిషంలో పూర్తయ్యేదిగాదు. ఇది హాస్టల్. ప్రక్క ప్రభవుంది. అతని గదివెళ్లి చెప్పేందుకు వీల్లేని పరిస్థితి.

నళిని దించుకపోయిన మొహం చూచి చంద్రం - 'నళినీ'! నామటుకు నేను ఇప్పుడు వెళ్లివుండేవాణ్ణి గాదు. కాని నాన్న వచ్చాడు వెళ్లక తప్పదు. ఉత్తరాల్లో కలుసుకుంటూనే వుంటాం, మరి వెళ్లొస్తా!" అని చంద్రం లేచాడు. లేనినవ్వు తెచ్చుకొని 'మంచిదిచంద్రం!' అన్నది.

చంద్రం వెళ్ళిపోయాడు, తన ఆశలు మంట గలిపి! తన హృదయాన్ని గాయపరిచి! తను ఏ ముహూర్తంకోసం ఇంతకాలం కాచుకొనివుందో ఆ సమయాన చంద్రం నిరాశా సంగీతాన్ని వినిపించి వెళ్ళిపోయాడు, ఇంతకాలమూ తను అలలుగా కలలు కన్నది! కాని, తాను మైకంలో ఉన్నాననీ, భావనాతరంగాల్లో తేలియాడుతున్నాననీ అనుకోక పైపెచ్చు చంద్రాన్ని నా ఆశలు భగ్నం చేశావని అనేసింది—దానికి కారణం తను కాకుండా చంద్రమే అయినట్టు!

పురుషుడు స్త్రీని చూసి భ్రమపడి ఆ మరో క్షణాన ఆమెతో 'నిన్ను ప్రేమిస్తున్నా' అని అంటాడని నళిని తలపోసింది. కాని అలా జరగలేదు. తనే అడుగు దాటని అయత్తమయేటప్పటికి ఆ అవకాశం కాస్తా చేజారిపోయింది.

* * *

రోజులు గడుస్తున్నాయి. నళిని క్లాసుకెళ్ళుతోంది. కాని రావువేపుకు చూడలేకపోతోంది. ఏదో తెలియనిదుఃఖం హృదయాన్ని ఆవరించి తన్ను భయపెడుతూ వుండేది. వెనుకటిలా రావుతో మాట్లాడటం మానేసింది. రావు కూడా అలాగే దూరదూరంగా వుంటున్నాడు. ఇది మరీ కష్టంగావుంది ఓరోజు తన అందాన్ని ప్రశంసించిన రావు ఈరోజు తనవేపుకూడా చూడకపోవటం ఆమె భరించలేక పోయింది. కాని చేసేదేముంది?

ఆపైన రావు వరసగా క్లాసుకు రావటం మానేశాడు. అలా రావు రాకపోవటం తనకు హాయిగా తోచింది. మళ్లా వెనకటిలా అందరిలో నవ్వుతూ, సంతోషంగా కాలాన్ని గడపసాగింది.

ఇలాంటి రోజుల్లో నళిని 'వెయిటింగ్ రూంలో కూచునివుండగా లెటర్ బాక్సులో తన పేరుతో ఒక ఉత్తరం చూసింది. గబగబా లేచి తీసుకొని చూసింది. చంద్రానిది! అతని వివాహమట! ఆరోజు వాళ్ళ నాన్నతో ఇంకో ఆయనకూడా వచ్చాడట-ఆయన కూతుర్నే! కట్నం ఏభైవేలు! చదవలేకపోయింది. ఆ ఉత్తరాన్ని చించి ముక్కలుముక్కలు చేసి అవతల పారేసింది. ఒక్కసారిగా దగ్గరగా 'నేనసలు పెళ్లే చేసుకోను!' అని అనుకుంది.

క్లాసులో కూర్చున్నదేగాని ప్రొఫెసర్ చెప్పేది తనకేమీ అర్థమవటంలేదు. ఎందుకో రావు గుర్తుకొచ్చాడు. రావు చాలామంచి వాడు. అతన్ని నేనర్థం చేసుకోటంలో పొరటుంది అని మొదటిసారిగా అనుకున్నది. ఇలా అనుకోటం తన వ్యక్తిత్వానికే భంగమని ఆమె అనుకోనేలేదు. అదీ ఆమె ఓటమి!

క్లాసునుంచి బయటికి వచ్చేప్పటికి - రావు తన స్నేహితులతో మాట్లాడుతున్నాడు. తప్పుకపోతున్న నళినిని రావు పేరుపెట్టిపిలిచి ఓవిషయంవింటావా! అన్నాడు. ఏమిటంది నళిని. 'వచ్చే శనివారం నా వివాహం! ఆ సందర్భంలో మన కాలేజీ వాళ్లు చాలామంది వస్తారు. వాళ్లతోపాటు నీవు కూడా రావాలి' అన్నాడు. నళినికి రావు ఏం చెబుతున్నాడో వినిపించలేదు. ఆమెలో ఏదో భయానకం పరవళ్లు తొక్కింది. ఇంటికి వెళ్లి పక్కమీద పడుకుంది. అప్రయత్నంగా ఏడ్చింది. అలాగే నిద్రవచ్చేసింది. నిద్రనుంచి లేచేప్పటికి కిటికీలోగుండా దూరంగా పడమట సముద్రంలో ఎర్రగా 'డేంజర్ లైట్'లా సూర్యుడు కన్పించాడు.

ఆ సమయంలోనే ప్రభ గదిలోకి ప్రవేశించి- "నళినీ! రావుకి పెళ్లిట. ఒచ్చే శనివారం జరుగుతుందట. వెళదాం వస్తావా?" అంది.'

ఇల్లు అమ్మకము

మద్రాసులోని త్యాగరాయ నగర్ లోని ఒక బంగళా అమ్మకమునకు ఉన్నది. నాలుగుగ్రౌండ్ల స్థలము. దక్షిణాభిముఖము. నీటి కుళాయి, ఎలక్ట్రిసిటీ, నుయ్యి, ఫలవృక్షాలు-అన్నీ ఉన్నాయి. ఖరీదు కాస్త ఎక్కువ తక్కువలో నలభై **వేల** రూపాయలు. వివరములకు: యస్. జి. ఆర్., కేరాఫ్ "తెలుగు స్వతంత్ర", రాయపేట, మద్రాసు-అని వ్రాయవలెను.